నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

**అమెరికా జట్టులో శాన్వి**

అమెరికా మహిళల జాతీయ క్రికెట్ జట్టులో హైదరాబాద్ మూలాలున్న 15 ఏండ్ల ఇమ్మడి శాన్వికి చోటు దక్కిందని అక్కడి మీడియా మార్చి 28న వెల్లడించింది. శాన్వి 2020లో శాన్‌రామన్ యూత్ క్రికెట్ అసోసియేషన్ కాలిఫోర్నియా తరపున క్రికెట్‌లో అరంగేట్రం చేసింది. అండర్-13 అరంగేట్రంలోనే 9 వికెట్లు తీసింది. శాన్‌డియాగో టీ20 టోర్నీలో 10 వికెట్లు పడగొట్టి జాతీయ జట్టుకు ఎంపికయ్యింది.

nipuna
Every Wednesday Free Supplement
03.
15 మే 2024
పేజీలు 8

# బొమ్మలాట కళారూపం.. భారతదేశమే జన్మస్థానం

- బొమ్మలాటలు జానపద కళారూపాల్లో ప్రముఖమైనవి. బొమ్మలాట అనాదిగా ప్రజలను ఉత్సాహపరుస్తున్న కళారూపం. భారతదేశంలో ఈ కళారూపాలది దాదాపు మూడువేల సంవత్సరాల చరిత్ర.
- చాలామంది పండితుల అభిప్రాయం ప్రకారం బొమ్మలాటల జన్మస్థానం భారతదేశమే. ఇక్కడినుంచి ఈ కళారూపాలు ఇతర ఆసియా దేశాలకు వ్యాపించాయి. కొంతమంది మాత్రం చైనా, గ్రీస్, ఇటలీ దేశాల్లో బొమ్మలాట ఆవిర్భవించి ఉండొచ్చంటారు. భారతదేశంలో మాత్రం క్రీస్తుపూర్వం నాటికే బొమ్మలాటలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. వీటికి సంబంధించిన ఆధారాలు క్రీ.పూ. 2వ శతాబ్దం నాటి తమిళ కావ్యం 'శిలప్పాదికారం', ఇంచుమించు అదే కాలానికి చెందిన భరతుడి 'నాట్యశాస్త్రం'లో ఉన్నాయి.
- అయితే నాట్యశాస్త్రంలో బొమ్మలాటలను ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. కానీ బొమ్మలను ఆడించే 'సూత్రధారుడి' ప్రస్తావన ఉంది. లభిస్తున్న ఆధారాలను బట్టి భారతదేశంలో క్రీ.పూ. 5వ శతాబ్దానికి ముందు నుంచే బొమ్మలాటలు ఉనికిలో ఉన్నాయి.
- భాగవతంలో శ్రీకృష్ణుడు సృష్టిని సత్త్వ, రజో, తమో గుణాలనే మూడు సూత్రాలతో ఆడిస్తున్నానంటాడు. మనిషిని (జీవిని) భగవంతుడు ఆడించే తోలుబొమ్మగా పేర్కొనడమూ ఉంది. సంస్కృతంలో బొమ్మలను 'పుత్తలిక', 'పుట్టిక' అంటారు. ఇది పుత్రుడు అనే పదానికి మూలమైన 'పుత్' అనే ధాతువు నుంచి పుట్టింది. కళాకారులు కూడా బొమ్మలను ఎంతో ఆదరంగా చూసుకుంటారు. శిథిలమైన బొమ్మలను నదిలో నిమజ్జనం చేస్తారు.
- బొమ్మలాటలు మొదట్లో దేవాలయంలో మతపరంగా మొదలయ్యాయి. తర్వాతి కాలంలో తమ పరిధిని విస్తరించుకున్నాయి. కొంతమంది కళారూపాలు హాస్య, వ్యంగ్య ప్రదర్శనలు చేసేందుకు బొమ్మలాటలను వాడుకోగా, ఆధునిక యుగంలో వైద్య, ఆరోగ్య, విద్యాపరమైన అంశాలు ప్రజలకు సులువుగా చేరేందుకు బొమ్మలాటలు మాధ్యమంగా ఉపయోగపడుతున్నాయి. కొన్నిదేశాల్లో ఇవి నాటకరంగంతో సమానంగా ఆదరణ పొందుతున్నాయి.

**రకాలు**

- బొమ్మలాట నాట్యం, నాటకం లాంటి ప్రదర్శన కళల కిందికి వస్తుంది. అలంకరణ, ఆడించే పద్ధతులు, ప్రదర్శించే విధానాల ఆధారంగా బొమ్మలాటలను నాలుగు రకాలుగా విభజించవచ్చు. అవి..
  1) చేతి తొడుగు బొమ్మలాట
  2) కడ్డీ ఆధారంగా ఆడించే బొమ్మలాట
  3) తాళ్ల ఆధారంగా ఆడించే బొమ్మలాట
  4) తోలుబొమ్మలాట
- మొదటి మూడు త్రి-మితీయ బొమ్మలాటలు (త్రీడీ).

## చేతి తొడుగు బొమ్మలు (Gloves Puppets)

- ఇవి చిన్న బొమ్మలు. వీటికి కదిలించే వీలున్న తల భాగం, చేతులు ఉంటాయి. కింది భాగం వస్త్రం కప్పి ఉంటుంది. కళాకారుడు దీన్ని చేతికి తొడుక్కుని తల భాగాన్ని చూపుడు వేలితో, మధ్య, బొటన వేళ్లతో బొమ్మ రెండు చేతులను కావాల్సిన రీతిలో ఆడిస్తూ ఉంటాడు.
- ఉదాహరణకు కప్పను తీసుకుంటే దీనికి కేవలం దవడ భాగాన్ని కదిపితే సరిపోతుంది. దీనికోసం కళాకారుడు తన చేతి బొటనవేలును కింది దవడ, మిగిలిన 4 వేళ్లను పై దవడగా ఉపయోగించి బొమ్మను ఆడిస్తాడు.



- ప్రస్తుతం చేతిబొమ్మల వారసత్వం ఒడిశా, కేరళ రాష్ట్రాల్లో మాత్రమే ఉంది. ఉత్తర ప్రదేశ్, తమిళనాడు, పశ్చిమబంగ (ఇక్కడ దీన్ని బేణీర్ పుతుల్ అంటారు) రాష్ట్రాల్లో కూడా ఈ కళ మనుగడలో ఉంది. అయితే వారసత్వంగా మాత్రం కాదు.

## కుంధేయి నాచ్/సఖి కుంధేయి

- ఇది ఒడిశాకు చెందిన తొడుగు బొమ్మలాట. ఒడియాలో కుంధేయి అంటే బొమ్మ, నాచ్ అంటే నాట్యం అని అర్థం. దీనికి సఖి కుంధేయి అనే పేరు కూడా ఉంది. సఖి అంటే ఇష్టమైన, కుంధేయి అంటే బొమ్మ అని అర్థం. ఇందులో కేవలం రెండే బొమ్మలు ఉంటాయి. అవి రాధాకృష్ణులవి. ఒడిశా జానపద కళలపై కృష్ణభక్తి ప్రభావం అధికం. అందువల్ల రాధ వెంట ఉండే చెలికత్తెల వల్ల బొమ్మలాటకు సఖి కుంధేయి అని పేరు వచ్చిందంటారు.
- ఇందులో ప్రదర్శించే బొమ్మలు జీవం ఉట్టిపడుతూ చూసేవారికి వాటిపై ప్రేమ కలిగేలా ఉంటాయని, అందుకే ఈ పేరు వచ్చిందన్నది మరో అభిప్రాయం. కుంధేయి నాచ్ బొమ్మలాటకు జయదేవుడి 'గీతగోవిందం' ప్రధాన సాహితీ ఆధారం.
- 16వ శతాబ్దానికి 'పంచశాఖ'గా ప్రసిద్ధి చెందిన ఐదుగురు కవులు ఒడియాలో రాసిన కృష్ణభక్తి సాహిత్యం, ఆ తర్వాత కాలంలో వెలువడిన కాల్పనికమైన రాకుమారులు, రాకుమార్తెల పాత్రలతో ఉన్న కావ్యాలు ఒడిశా నాటక రంగాన్ని ప్రభావితం చేశాయి. ఒడియా తొడుగు బొమ్మల కళాకారులు ఏ నాయికా నాయకుల గురించి పాడినా వాటిలో అంతర్లీనంగా ఉండేది రాధాకృష్ణుల తత్వమే.



- సఖి కుంధేయి కళాకారుడు రెండు చేతుల్లో రెండు తొడుగు బొమ్మలు పట్టుకుని, డోలు వాయిస్తూ కథాగానం చేస్తూ ఉంటాడు. ఆట ప్రదర్శనకు ఏ విధమైన వేదికా అవసరం లేదు.

## పావకూత్తు

- కేరళ రాష్ట్ర చేతి తొడుగు బొమ్మలాట. మలయాళంలో పావ అంటే బొమ్మ, కూత్తు అంటే నాట్యం. పావకూత్తులో ఉపయోగించే బొమ్మలు కేరళ శాస్త్రీయ నృత్యం 'కథాకళి' నాట్యకారులను పోలి ఉంటాయి. అందుకే దీనికి పావకథాకళి అనే పేరు కూడా ఉంది.
- కథాకళి ప్రదర్శన కోసం రాసిన 'అట్టకథ'లనే పావకూత్తు ప్రదర్శనల్లో ఉపయోగిస్తారు. ఈ కళా ప్రదర్శనకు ప్రత్యేకంగా వేదిక అవసరం లేదు. ప్రదర్శనలు రాత్రిళ్లు దీపం వెలుగులో జరుగుతాయి. ప్రధాన కళాకారుడు తన అనుచరులు, వాద్యకారులతో కలిసి నేలమీద కూర్చుని ప్రదర్శన ఇస్తాడు. ఆట ప్రారంభానికి ముందు 'కేళికొత్తు'గా పిలిచే లాంఛనాలను జరుపుతారు. దీనికి రామాయణ, భారత కథలే ప్రధాన సాహితీ ఆధారాలు.



## కఠి కుంధేయి నాచ



- ఇది ఒడిశాకు చెందిన ప్రదర్శన కళ. కఠి అంటే కడ్డీ, కుంధేయి అంటే బొమ్మ, నాచ్ అంటే నాట్యం లేదా ఆట. ఈ ఆటకు సంబంధించిన బొమ్మలు 12 నుంచి 18 అంగుళాల ఎత్తు ఉంటాయి. తల, భుజాల దగ్గర కీళ్లు ఉంటాయి. తల భాగానికి కడ్డీ అమర్చి ఉంటుంది. భుజాలకు తాళ్లు వేలాడదీసి ఇందులో కడ్డీ, తాళ్లతో ఆడించే లక్షణాలు ఉన్నప్పటికీ ఇది కడ్డీ ఆధారంగా ఆడించే రకానికి చెందింది.
- ఈ ఆట కళాకారులు ఒక వేదిక మీద కూర్చుని బొమ్మలను ఆడిస్తారు. ఆట సరళంగా ఉంటుంది. దుర్గాదేవి మహిషాసురుణ్ని సంహరించడం, రాముడు తాటకను చంపే ఘట్టాల ప్రదర్శన అద్భుతంగా ఉంటుంది. ప్రేక్షకులు ఎంతో తన్మయత్వానికి లోనవుతారు. ప్రదర్శన పాటలు, డైలాగుల రూపంలో ఒడియా జానపద, శాస్త్రీయ బాణీలతో సాగుతుంది. రామాయణం, మహాభారతం, భాగవత కథలు సాహితీ ఆధారాలు.

## కడ్డీ ఆధారంగా ఆడించే బొమ్మలాట (Rod Puppet)

- ఇవి కూడా చేతి తొడుగు బొమ్మల్లాంటివే అయినప్పటికీ పరిమాణంలో పెద్దగా ఉంటాయి. వీటికి దన్నుగా ఒక కడ్డీ ఉంటుంది. ఈ కడ్డీ ఆధారంగానే వీటిని ఆడిస్తారు. దేశంలో వీటినే ఆడించే కళాకారులు నిలువెత్తు తెర వెనుక ఉండి కేవలం బొమ్మలు మాత్రమే కనిపించేలా ప్రదర్శన ఇస్తారు. ఇప్పుడు బొమ్మలాటలో చేతి తొడుగు, కడ్డీ కీలుబొమ్మల లక్షణాలను మేళవించి ప్రదర్శనలు ఇస్తున్నారు.
- ఈ కళారూపాలు పశ్చిమబంగ, ఒడిశా, బీహార్ రాష్ట్రాల్లో ఉన్నాయి. ఈ ప్రదర్శనలో బొమ్మలను కడ్డీ ఆధారంగా కింది నుంచి ఆడిస్తారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో తాళ్లు, కడ్డీ రెండిటినీ కలిపి ఆడించే కళారూపాలు మనుగడలో ఉన్నాయి. ఇందులో బొమ్మలను కడ్డీ ఆధారంగా పట్టుకున్నప్పటికీ తాళ్ల ఆధారంగా పై నుంచి ఆడిస్తారు.



## పుతుల్ నాచ్

- ఇది పశ్చిమబంగాకు చెందిన కడ్డీతో ఆడించే బొమ్మలాట. పుతుల్ అంటే బొమ్మ, నాచ్ అంటే ఆట లేదా నాట్యం. వీటికి మెడ, రెండు భుజాల దగ్గర మొత్తం మూడు కీళ్లు ఉంటాయి. కొన్నిటికి మాత్రం మోచేతుల దగ్గర కూడా కీళ్లు ఉంటాయి. దీనికే డాంగేర్ పుతుల్ అనే పేరు కూడా ఉంది.
- వేదిక విషయానికి వస్తే కళాకారులు తాము కనిపించకుండా కేవలం బొమ్మలు మాత్రమే కనిపించేలా ఏర్పాటు చేసిన తెరలు ఉంటాయి. తల, భుజాలకు బిగించిన కడ్డీలను కదిలించడం ద్వారా బొమ్మలను ఆడిస్తారు. బొమ్మల కదలికకు అనుగుణంగా కళాకారులు తగిన డైలాగులు చెబుతూ పాటలు పాడతారు. హార్మోనియం, మద్దెల, తాళాలతో వేదికకు ఒక పక్కన కూర్చున్న వాద్యగాళ్లు పుతుల్ నాచ్ ఆటకు నేపథ్య సంగీతం అందిస్తారు. ఈ ప్రదర్శనలు బెంగాల్ జానపద నాటకం 'జాత్రా'ను పోలి ఉంటాయి. పుతుల్ నాచ్‌కు ప్రధాన సాహితీ ఆధారం రామాయణం.



## యమ్‌పురి



- ఇది బీహార్‌కు చెందిన కడ్డీ ఆధారంగా ఆడించే బొమ్మలాట. పశ్చిమబంగా, ఒడిశా రాష్ట్రాల్లో ఉన్న బొమ్మల్లా కాకుండా యమ్‌పురి బొమ్మలను ఒకే దారువు (కొయ్య)తో రూపొందిస్తారు. అందుకే వీటికి కీళ్లు ఉండవు. ఆ తర్వాత వీటి మీద ఆయా ఆకారాల శరీర భాగాలు చిత్రించి రంగులు అద్దుతారు. వీటిని ఆడించటానికి కొంచెం నైపుణ్యం అవసరమవుతుంది.

సంకలనం
హర్షవర్ధన్ చింతలపల్లి